సాక్షి
నారాయణపేట

గురువారం ♦ 4 ♦ జనవరి ♦ 2024



మనుగడలోకి హౌసింగ్‌శాఖ

రాష్ట్రంలో గృహ నిర్మాణ సంస్థ మనుగడ లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వివరాలు 8లో ▸



రైల్వే సిగ్నలింగ్ పరిశీలన

రైల్వే జీఎం కాచిగూడ–మహబూబ్‌నగర్–దేవరకద్ర– కృష్ణ సెక్షన్‌ను తనిఖీ చేశారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.2/15.8

వాతావరణం

చలితీవ్రత అధికంగా ఉండి అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం . రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చలాన్ల రాయితీని వినియోగించుకోవాలి



నారాయణపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వాహనదారులకు అందిస్తున్న డిస్కౌంట్ చాలన్ల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ రవి బాబు కోరారు. జిల్లా కేంద్రంలో పలు చౌరస్తాల్లో బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టి, పెండింగ్ చాలన్లను కట్టించారు. ఎక్కువ రోజులు అలాగే ఉంటే నష్టపోతారని హెచ్చరించారు. పెండింగ్ చాలన్లపై ప్రభుత్వం భారీ రాయితీ ఇస్తుందని, ద్విచక్రవాహనాలకు 80శాతం, ఫోర్ వీలర్లు, ఆటోలపై 60శాతం, లారీ, ఇతర భారీ వాహనాలకు 50శాతం రాయితీ ఉంటుందన్నారు. వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వాటిపై దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలకు ఫైన్లు వేశారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కోస్గి: పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి, ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా చూడాలని డీఈఓ అబ్దుల్‌గని తెలిపారు. బుధవారం మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో ప్యానెల్ పరిశీలన బృందం పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల స్పందన తదితర అంశాలను ఈ ప్యానెల్ పరిశీలన బృందం పరిశీలించారు. అనంతరం డీఈఓ, ఎంఈఓ విద్యాసాగర్‌లు ఈ పాఠశాలలలో ఈ పరిశీలనపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదోతరగతితో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సిద్దిరాములు, ఎంఎన్ఓ శంకర్‌నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, పరిశీలన బృందం సభ్యులు పాల్గొన్నారు.

విద్యకు నైపుణ్యం జోడిస్తే కొలువులు



నారాయణపేట రూరల్: ప్రతీ వ్యక్తి తన చదువుతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలు అందివస్తాయని అసిస్టెంట్ లేబర్ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భవన కార్మిక సంఘం, సెట్విన్ సరివ్సెస్ సంయుక్తంగా బుధవారం ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. వివిధ రకాలైన 46 కోర్సులకు సంబంధించి ఉపాధి అవకాశాలను తెలియచేశారు. ఉచిత కెరియర్ గైడెన్స్ అందించారు. నేటి ప్రపంచంలో ప్రతి ఒక్కరి దగ్గర డిగ్రీ పట్టాలు ఉంటున్నాయని, నైపుణ్యాదారిత తెలివితేటలు కల్గిదన వారికి చక్కటి ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయన్నారు. అనంతరం 135మందికి సర్టిఫికేట్లు అందించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రంగారెడ్డి, కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు, సాధిక్, సూరిబాబు, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

అలసందలు క్వింటా రూ.8,012

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం అలసందలు క్వింటా గరిష్టం, కనిష్టంగా రూ.8,012 ధరలు పలికాయి. అలాగే, వడ్లు హంస గరిష్ట, కనిష్టంగా రూ.1,910, వడ్లు సోనా గరిష్టంగా రూ.3,071, కనిష్టంగా రూ.2,366, తెల్లకందులు గరిష్టంగా రూ.9,268, కనిష్టంగా రూ.7,800, ఎర్ర కందులు గరిష్టంగా రూ. 9,569, కనిష్టంగా రూ.8,960ధరలు పలికాయి.


కందుల ధర రూ.8,622

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,622, కనిష్టంగా రూ.8,509గా ధరలు నమోదయ్యాయి. ఆముదాల ధర గరిష్టంగా రూ.5,312, కనిష్టంగా రూ.5,300గా ధరలు వచ్చాయి.

ర్యాంకుల కోసం.. ప్రాణాలు పణం

ఇంటర్, ఎస్సెస్సీ విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి

- ఎంసెట్, నీట్ పేరిట ప్రిపరేషన్, ప్రత్యేక ఫీజుల వసూలు
- స్పెషల్ క్లాస్‌ల పేరిట పొద్దుపోయే దాకా పుస్తకాలతో కుస్తీ
- భరించలేక ప్రాణాలు బలి తీసుకుంటున్న విద్యార్థులు
- తమకేం సంబంధం లేదన్నట్లు విద్యాశాఖ తీరు
- నష్టం జరిగాక 'అయ్యో.. దేవుడా' అంటూ తల్లిదండ్రుల ఆక్రోశం



'1, 2, 3.. పదిలోపు ర్యాంకులు మా విద్యార్థులవే.. పరీక్షలు ఏవైనా మెరుగైన ర్యాంకులు మా విద్యా సంస్థలదే.. అని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ఊదరగొడితే.. 'మా అబ్బాయికి మొదటి ర్యాంకు వచ్చింది.. మా అమ్మాయికి రెండో ర్యాంకు వచ్చింది.. అంటూ తల్లిదండ్రులు గొప్పగా చెప్పకొంటారు..' ఇంత వరకు బాగానే ఉన్నా.. ఈ మధ్యలో విద్యార్థులు ఎంతటి ఒత్తిడి అనుభవిస్తున్నారు.. ఎలా చదువుకుంటున్నారు.. అని మాత్రం ఎవరూ పట్టించుకోరు.. ఈ క్రమంలో ఏదైనా జరగరానిది జరిగితే మాత్రం ఒకరిపై ఒకరు నెట్టుకొంటూ విద్యాసంస్థలు చేతులు దులుపుకొంటే.. తల్లిదండ్రులు కడుపు కోతతో జీవితాలను నెట్టుకొస్తున్నారు.. మొత్తంగా తల్లిదండ్రుల అత్యాశ.. విద్యాసంస్థల ధనదాహం.. ప్రభుత్వ పట్టింపులేని తనం వల్ల విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు..

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

ర్యాంకుల కోసం విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారు. సమయం.. సందర్భం లేకుండా ఎప్పుడూ ప్రిపరేషన్ అంటూ పుస్తకాలతో కుస్తీ పట్టిస్తున్నారు. రోజువారి సాధారణ తరగతులే కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల పేరిట విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీటిని కొందరు విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ మెరుగైన ఫలితాలు సాధిస్తే.. మరికొందరు మాత్రం తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం మహబూబ్‌నగర్‌లోని మైనార్టీ గురుకులంలో ఓ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు తీవ్రమైన ఒత్తిడే కారణం అన్న ఆరోపణలు వచ్చాయి. అయితే ఇన్నాళ్లు ప్రైవేట్‌లో చోటుచేసుకున్న పై సంఘటనలు ఇప్పుడిప్పుడే ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యా సంస్థలకు విస్తరిస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పాఠశాల స్థాయి నుంచే..

ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఐఐటీ, నీట్‌లో సీట్లు సాధించాలన్న ఉద్దేశంతో చాలా ప్రైవేట్ పాఠశాలల్లో 8వ తరగతి నుంచే మెటీరియల్స్ పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల నుంచి అదనంగా రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. సాధారణ తరగతులు పూర్తయిన వెంటనే స్పెషల్ క్లాస్‌ల పేరిట ఐఐటీ, నీట్ కోసం శిక్షణ ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు వార్షిక పరీక్షల సిలబస్‌పై దృష్టి సారించాలా.. లేక ఐఐటీ, నీట్ వంటి వాటిపై దృష్టిపెట్టాలా అన్న అంశాలతో గందరగోళానికి గురవుతున్నారు.

■ గత వారం రోజుల క్రితం క్రిష్టియన్‌పల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సెలవు దినాలు, ఆదివారాల్లోనూ తరగతులు నిర్వహిస్తూ.. పరీక్షలు పెడుతున్నారని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పాఠశాల విద్యార్థులే స్వయంగా డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన ఎంఈఓతో విచారణ జరిపించారు. స్పెషల్ క్లాస్‌లు, పరీక్షల నిర్వహణ నిజమే అని తేలడంతో పాఠశాలను హెచ్చరించారు.

కళాశాలలే కోచింగ్ సెంటర్లు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 60కి పైగా ప్రైవేట్ **కళాశాల**లు ఉన్నాయి. వీటిలో 15కు పైగా **కళాశాల**ల్లో నేరుగా ఐఐటీ, నీట్ వంటి **వాటికి** కోచింగ్ ఇస్తున్నారు. ఇంటర్మీడియట్ **తర్వాత** జరిగే ఐఐటీ, నీట్ వంటి వాటికి ఇం**టర్ మొ**దటి సంవత్సరం నుంచే శిక్షణ ఇస్తు**న్నారు.** ఇందుకోసం ప్రత్యేకంగా తరగతుల **నిర్వహణ,** మెటీరియల్ పేరిట ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాల సాధారణ తరగతులు ముగిశాక ఉదయం, సాయంత్రం ఐఐటీ, నీట్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లోనూ ఈ తరగతులు కొనసాగుతుండటంతో విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇలాంటి కోచింగ్ సెంటర్లు నిర్వహించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.



మైనార్టీ గురుకులంలో విద్యార్థి ఆత్మహత్యపై ఆరా తీస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు (ఫైల్)

నిబంధనలకు విరుద్ధంగా..



మెరుగైన ఫలితాల పేరిట విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారు. గురుకులాల విద్యార్థులను కనీసం సెలవులకు కూడా పంపించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రైవేట్ విద్యాసంస్థలు నీట్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పేరిట విద్యార్థులను వేధిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్పెషల్ తరగతులు నిర్వహిస్తున్నారు. వాటిపై ఇంటర్మీడియట్ శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

తనిఖీలు నిర్వహిస్తాం..



జిల్లాలోని ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించవద్దు. నిర్ణీత సమయం మేరకు మాత్రమే కళాశాలలు నడపాలి. ఈ మేరకు అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలకు ఆదేశాలు జారీ చేస్తాం. ఇక నుంచి ఉదయం, సాయంత్రం కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి.. ఎక్కడైనా తరగతులు జరిపిస్తే చర్యలు తీసుకుంటాం. ఎవరైనా చదువు పేరిట ఇబ్బందులకు గురిచేస్తే విద్యార్థులు నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు.

– వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖాధికారి, మహబూబ్‌నగర్

విద్యార్థి మృతి ఘటనలో.. ఉద్యోగుల సస్పెన్షన్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర–2 కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రాంరెడ్డి(17) మృతి ఘటనకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి షఫీవుల్లా ఆరుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బుషిరా ఫాతిమా, పీజీటీ సాంఘికశాస్త్రం కిషోర్‌కుమార్, టీజీటీ ఉర్దూ సాలేహబేగంలను సస్పెన్షన్ చేశారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పీఈటీ క్రాంతికుమార్, ఉర్దూ జూనియర్ లెక్చరర్ అబ్దుల్ ఖదీర్, సెక్యూరిటీ గార్డు అబ్దుల్ రహెమాన్‌పై వేటు వేశారు.

ప్రిన్సిపాళ్లు, అధికారులతో సమావేశం

మైనార్టీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి షఫీవుల్లా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రిన్సిపాళ్లు, ఇతర అధికారులతో వీడియో జూమ్ సమావేశం నిర్వహించారు. గురుకుల పాఠశాలల్లో రాత్రిపూట విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. అడ్మిషన్లు, ఇతర అంశాలపై అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు తెలిసింది.

ప్రగతి నివేదికలు అందించండి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు గతేడాది ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు సాధించిన ప్రగతి, చేరుకున్న లక్ష్యాలపై ఒక పేజీ నివేదికను తయారు చేసి ఇవ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖల అచీవ్‌మెంట్ తప్పనిసరిగా పొందుపరిచి నాలుగు, ఐదులైన్లలో కుప్తంగా రాసి గురువారం సాయంత్రంలోగా అందజేయాలని ఆదేశించారు. జిల్లా సమగ్ర అభివృద్ధిపై డాక్యుమెంటరీ తయారు చేసేందుకు అన్ని శాఖల ప్రాతినిధ్యం తప్పనిసరి అవసరమని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విద్యాశాఖ అధికారులు

కలెక్టర్ కోయ శ్రీహర్షను డీఈఓ అబ్దుల్ ఘని, క్వాలిటీ కో ఆర్డినేటర్ విద్యాసాగర్ బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ మొక్క అందజేశారు. అనంతరం డీఆర్పీలు 2023లో విద్యాశాఖలో అమలు జరిగిన సమ్మర్ క్యాంప్, వెలుగు అభ్యాసమిత్ర, ఎఫ్ఎల్ఎస్, జాలి ఫోనిక్స్ కార్యక్రమాలపై సమగ్ర నివేదికను సమర్పించారు. సమావేశంలో ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్‌లు శ్రీకాంత్, భాస్కర్ రెడ్డి, నరేందర్, రాఘవేంద్ర, మల్లేశ్, రాజునాయక్, శ్రీనివాస్, లక్ష్మణ్, అపర్ణ, జానకి రాములు, రషీద్‌లు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నారాయణపేట: జిల్లాలో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో సెర్ప్, ఉపాధి హామీ పనులపై జిల్లా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో కలసి సంబంధిత డీపీఎంలు, ఏపీఎం, ఏపీఓ, ఈసీలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గ్రామ పంచాయతీల వారీగా నర్సరీలకు ఎంత ఖర్చు జరిగిందనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నర్సరీలో మొక్కల పెంపకం పనులు ఎలా జరుగుతున్నాయని, ముగ్గురు, నలుగురు కూలీలతో పనులు వేగవంతం ఎలా అవుతాయని ప్రశ్నించారు.

కలెక్టర్ ఆగ్రహం..

సెర్ప్, ఉపాధి హామీ పనులపై చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమయపాలన పాటించడం లేదని ఈ సందర్భంగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఊట్కూర్, మద్దూర్, నారాయణపేట ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు కనిపించడం లేదని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. విత్తనాల సేకరణ, బ్యాక్ ఫిల్లింగ్ పనులు ఎంత వరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఎవెన్యూ ప్లానిటేషన్ సరిగ్గా లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మండలాల వారిగా ఎస్‌హెచ్‌జి గ్రూపుల వివరాలు, బ్యాంకు లింకేజీ టార్గెట్లను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌జి గ్రూపులను సమన్వయం చేసి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సమావేశంలో చూపిస్తున్న లెక్కలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేకుండా పోతుందని, ఇది మంచి పద్ధతి కాదని, టార్గెట్లు పూర్తి చేయని వారిని పక్కన పెట్టడం ఖాయమన్నారు. ఉద్యోగులు, సిబ్బంది ఎవ్వరూ సమయపాలన పాటించడం లేదని, ఇక నుంచి బయోమెట్రిక్ హాజరు శాతం ద్వారానే వేతనాలు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. మార్చిలోగా మండలాల వారీగా అందరూ తమ తమ టార్గెట్లను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ గోపాల్‌నాయక్, డీపీఎంలు, ఏపీఎంలు, ఏపీఓలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



ఎస్పీ యోగేష్ గౌతమ్‌కు బొకే అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు సిబ్బంది

నారాయణపేట రూరల్: ప్రజా క్షేమమే లక్ష్యంగా సమాజానికి మరింత మెరుగైన సేవలను అందించేందుకు ప్రతీ పోలీసు కృషిచేయాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కలసి బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొకేలు అందించి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం సమావేశం నిర్వహించి వారితో మాట్లాడుతూ.. నేర, ప్రమాదరహిత జిల్లాగా తయారు చేయాలని, మహిళా భద్రతకు పెద్దపీట వేయాలన్నారు. పీపుల్ ఫ్రెండ్లీపోలీసు విధానంలో ప్రజలతో స్నేహపూర్వకంగా మసులుకోవాలని, మర్యాదగా మాట్లాడాలన్నారు. ప్రజలు ఫిర్యాదులు అందించేందుకు స్టేషన్‌కు వస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందని నమ్మేలా భరోసా ఇవ్వాలన్నారు. క్షేత్ర స్థాయిలో క్రమశిక్షణగా మెలుగుతూ పోలసుశాఖకు మరింత గౌరవాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీలు వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఖానాపూర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్

మక్తల్: పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. బుధవారం మక్తల్ మండలం లింగంపల్లి, ఖానాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన 5 గ్యారెంటీల పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. లబ్ధిదారులు తమ దరఖాస్తులకు ఆధార్ కార్డుతో పాటుగా తెల్లరేషన్ కార్డు జిరాక్స్ కాపీని జత చేయాలన్నారు. అలాగే ప్రజల నుంచి తీసుకున్న ప్రతి దరఖాస్తుకు రశీదు అందజేయాలని ఆమె అధికారులకు సూచించారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు నిశితంగా పరిశీలన చేయాలని, ఖాళీలు ఉంటే సమాచారం తెలుసుకుని పూరించాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలనలో మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించిన పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జాన్‌సుదాకర్, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ సద్గుణ, ఖానాపూర్ సర్పంచులు నర్సిములు, సుజాత, త్రివేణి, ఎంపిటిసి వెంకటయ్య, లింగంపల్లి ఎంపిడిఓ లత పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి


అనంతరం అడిషనల్ కలెక్టర్.. తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీ నాయకులతో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికలకు అందరు సహకరించాలని కోరారు. ఎన్నికల కమిషన్ కాదేశాల మేరకు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణరాజు, రాజకీయ నాయకులు రాజశేకర్‌రెడ్డి, రవికుమార్, గోవిందురాజు, తదితరులు పాల్గొన్నారు.

మాల్‌ప్రాక్టీస్ విద్యార్థులు హాజరుకావాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంవీఎస్ డిగ్రీ కళాశాల పరీక్షల్లో 1, 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ అయిన విద్యార్థులు శుక్రవారం కళాశాల ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో మధ్యాహ్నం 2గంటలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు కారణాలు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

డీఐజీగా జోయల్ డేవిస్

- రామగుండం కమిషనర్‌గా ఎల్ఎస్ చౌహాన్ బదిలీ



మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ జోన్–7 డీఐజీగా 2010 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ జోయల్ డేవిస్‌ను నియమించారు. ప్రస్తుత డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను రామగుండం కమిషనర్‌గా బదిలీ చేశారు. గతేడాది నూతనంగా ఏర్పాటైన జోగుళాంబ జోన్–7 డీఐజీగా ఎల్ఎస్ చౌహాన్ 2023 జనవరి 8న డీఐజీగా బాధ్యతలు తీసుకున్నారు. జోన్ ఏర్పాటు తర్వాత మొదటి డీఐజీగా వచ్చిన ఆయన జిల్లాలో ఏడాదిపాటు పనిచేశారు. ప్రస్తుతం డీఐజీగా నియామకమైన జోయల్ డేవిస్ హైదరాబాద్ సిటీలోని ఎస్‌బీ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. డీఐజీ జోయల్ డేవిస్ స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాలోని కొట్టికోడు గ్రామం. 2010లో ఐపీఎస్‌గా ఎంపికై న తర్వాత మొదటి పోస్టింగ్ జనగాం ఏఎస్పీగా పని చేశారు. ఆ తర్వాత ఉట్నూర్, ఆదిలాబాద్ ఏఎస్పీగా, హైదరాబాద్ వెస్ట్ జోన్ డీసీపీగా పనిచేయడం జరిగింది.

కృష్ణా స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి



కృష్ణాలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలంటూ రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేస్తున్న నాయకులు

కృష్ణా: కృష్ణా రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలంటూ సికింద్రాబాద్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం కృష్ణా రైల్వే స్టేషన్‌కు వచ్చిన జీఎంను వారు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అమర్‌కుమార్ దీక్షిత్ మాట్లాడుతూ గతంలో ఈ స్టేషన్‌లో ఏవైతే రైళ్లు నిలిచేవో వాటినే నిలపాలంటూ కోరారు. గత కరోనా, లాక్‌డౌన్ విధించిన నాటి నుంచి ఈ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపకుండా రద్దు చేశారు. దీని మూలంగా కృష్ణానదికి వచ్చే భక్తులకు, చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విధిలేని పరిస్థితుల్లో కర్ణాటకలోని రాయచూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తుందని, ఇప్పటికైనా కృష్ణా స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు జీఎం మక్తల్, జక్లేర్, తదితర రైల్వే స్టేషన్లను పరిశీలించారు. కొత్తగా నిర్మాణమైన రైల్వే లేన్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

మహిళా లోకానికి స్ఫూర్తిప్రదాత



సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేయడంతోపాటు.. స్త్రీ విద్యా విప్లవకారిణి, నేటి మహిళా లోకానికి స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మక్తల్‌లో సావిత్రిబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. వేల సంవత్సరాల స్త్రీల బానిసత్వానికి విముక్తి మార్గదర్శిని విద్యావిజ్ఞానం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను స్త్రీ జాతికి ప్రసాదించి, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. అక్షరం జాడ తెలియని సావిత్రిబాయి పూలే భర్త ప్రోత్సాహంతో తన వద్దే చదవడం, రాయడం నేర్చుకుందన్నారు. భర్త ఆశయాల సాధన కోసం ఆయనతో కలిసి నడిచిందన్నారు. అసలు ఆడపిల్లలకు చదువు అనే ఆలోచనే లేని కాలంలో చదువులను వాడవాడల్లోకి ప్రతి గడపలోకి తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ రాములు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాస్కర్, బండారి వెంకటేష్, నర్సిములు, పాలప్ప, స్వరుపరాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోపాల్‌పేట: నిప్పంటించుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన బీసమ్మకు కూతురు, కుమారుడు ఉండగా ఇద్దరికీ వివాహాలు అయ్యాయి. కూతురు వారి అత్తారింటికి వెళ్లగా, కుమారుడు పరశురాములు భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మంగళవారం మండల కేంద్రంలో ప్రజాపాలనలో దరఖాస్తు ఇచ్చేందుకు పరశురాములు వచ్చాడు. సాయంత్రం స్థానికులతో చిన్నపాటి గొడవ అయ్యింది. దీంతో తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ఇంటివద్ద ఉన్న పెట్రోల్ ఒంటి మీద పోసుకుని నిప్పంటించుకున్నాడు. అనంతరం నొప్పి తాళలేక కేకలు వేశాడు. నిద్రలేచిన తల్లి బీసమ్మ మంటలు ఆర్పి అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించినట్లు తెలిసింది.

బైక్‌పై నుంచి పడి వివాహిత దుర్మరణం


కవిత (ఫైల్)

కల్వకుర్తి టౌన్: సొంత పనులు ముగించుకొని ఇంటికి బైక్‌పై తిరిగి వెళ్తున్న భార్యభర్తలు ప్రమాదవశాత్తు కింద పడగా, భార్య మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊర్కొండ మండలంలోని జకినాలపల్లి అమ్మాయిపల్లి తండాకు చెందిన దేవేందర్, ఆయన భార్య కవిత (28)తో కలిసి కల్వకుర్తికి సొంత పనుల నిమిత్తం వచ్చారు. పనులు ముగించుకుని ఇంటి వద్ద నీటి కోసం డ్రమ్మును తీసుకొని బైక్‌పై తిరుగు పయనమయ్యారు. పట్టణంలోని ఎల్‌ఐసీ ఆఫీస్ వద్దకు రాగానే బైక్‌పై గాలికి తోడు డ్రమ్ము ఖాళీగా ఉండటంతో డ్రమ్ముతో సహా కవిత జారి కిందపడిపోయింది. వెంటనే దేవేందర్ కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, తలకు తీవ్ర గాయం కావటంతో అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బాలానగర్: బాలానగర్ మండలంలోని అప్పాజిపల్లికి చెందిన కొత్తూర్ శారద (32) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. గత డిసెంబర్ 28న వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలి తల్లి జంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధం

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లిలో బుధవారం మధ్యాహ్నం బంటు సైదులుకు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లోని తిండి గింజలతో పాటు ఇతర వస్తువులు, సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. రూ.50 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఆ సమయంలో సైదులు కుటుంబ సభ్యులు వరినాట్లు వేసేందుకు పొలం వద్దకు వెళ్లారు. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన ఇరుగు పొరుగు వారు నీళ్లు చల్లి మంటలు ఆర్పి వేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న బియ్యం, టీవీ, ఇతర వస్తువులు, దుస్తులు, పాలతిన్ కవర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మార్కెట్‌లో నిలకడగా ఉల్లి ధర


దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని తూకం వేస్తున్న హమాలీలు

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. రెండు వారాలుగా గరిష్ట ధరలు పెరగడం లేదు. కనిష్ట ధరలు అటు ఇటుగా మారుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌కు కొత్త ఉల్లి వస్తుండంతో వ్యాపారం జోరందుకుంది. తెల్లగా నాణ్యంగా ఉన్న ఉల్లికి గరిష్ట ధరలు నమోదు అవుతుండగా.. ఎర్రగా ఉన్న ఉల్లికి కనిష్ట ధరలు పలుకుతున్నాయి.

జోరుగా అమ్మకాలు..

దేవరకద్ర మార్కెట్‌కు పలు గ్రామాల నుంచి రైతులు అమ్మకానికి ఉల్లిని తీసుకొచ్చారు. మార్కెట్ వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. క్వింటాల్ ఉల్లి ధర గరిష్ఠంగా రూ.2,600 కనిష్ఠంగా రూ.1,100ల వరకు ధరలు నమోదయ్యాయి. తూకాల అనంతరం 45 కిలోల ఉల్లి బస్తా ఎక్కువగా రూ.1,300, తక్కువగా రూ.550ల వరకు విక్రయించారు. మార్కెట్‌లో జోరుగా లావాదేవీలు సాగాయి. ఇతర మార్కెట్ల నుంచి వచ్చిన వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని వాహనాల్లో తరలించారు.


దివిటి పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

మనుగడలోకి హౌసింగ్‌శాఖ?

- గృహ నిర్మాణ సంస్థను పునరుద్ధరించే ఆలోచనలో సర్కారు
- ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలయితే పూర్వవైభవం
- త్వరలో మార్గదర్శకాలు


ఇళ్ల వివరాల కంప్యూటరైజ్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గృహ నిర్మాణ సంస్థ మళ్లీ మనుగడలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం చేయడంతో స్వయం ప్రతిపత్తి కోల్పోయింది. గతంలో గృహ నిర్మాణాల పరంగా హౌసింగ్‌శాఖ కీలక పాత్ర పోషించేది. ఈ సంస్థను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గృహ నిర్మాణ సంస్థను పునరుద్ధరిస్తే మళ్లీ పూర్వవైభవం వస్తుందన్న ఆనందం సంబంధిత అధికారుల్లో వ్యక్తమవుతోంది. ఈ సంస్థకు సంబంధించి హైదరాబాద్ కార్పొరేషన్ యథావిధిగా కొనసాగుతుందని చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో గృహ నిర్మాణ సంస్థకు సంబంధించి కార్యాలయం కొనసాగుతుండగా.. వేళ్ల మీద లెక్కించే సిబ్బంది మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు. విలీనానికి ముందు ఈ సంస్థ కార్యాలయంలో నిత్యం క్షేత్రస్థాయి సిబ్బంది రాకపోకలు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నిరంతర పర్యవేక్షణ, నివేదికల తయారీ అన్నీ ఇక్కడి నుంచే సాగేవి. మళ్లీ పునరుద్ధరణకు నోచుకుంటే క్షేత్ర స్థాయిలో డీఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇలా అన్ని పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. కలెక్టర్ ఆదేశాలతో ఇక్కడి నుంచే మంజూరు ఇవ్వడం, కార్యాలయం నుంచే పనుల నివేదికలు రూపొందించడం, క్షేత్ర స్థాయిలో సొంత సిబ్బందితో నిర్మాణ పనులు చేపట్టడం వంటివి జరుగుతాయి. కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఈ సంస్థకు పూర్వవైభవం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

ఎలాంటి సమాచారం లేదు..

హౌసింగ్ శాఖ పునరుద్ధరణ అంశంపై మాకు ఎలాంటి సమాచారం లేదు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. గృహ నిర్మాణ సంస్థ పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– వైద్యం భాస్కర్, హౌసింగ్ పీడీ

ప్రస్తుతం పరిమిత పనులు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గృహ నిర్మాణ సంస్థను ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం చేసిన తర్వాత కూడా హౌసింగ్ అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. సంస్థకు చెందిన నలుగురు అధికారులు మాత్రమే ప్రస్తుతం బాధ్యతల నిర్వహణలో ఉన్నారు. ప్రధానంగా కలెక్టర్ నుంచి మంజూరు వచ్చినటువంటి ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో అమలు, వాటి పురోగతి, బిల్లుల చెల్లింపునకు సంబంధించి నివేదిక రూపొందించే వరకే నోడల్ అధికారులు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక ఇళ్ల నిర్మాణాల బాధ్యతలను అప్పట్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌తో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించింది. ఆయా శాఖల ఆధ్వర్యంలోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు సాగాయి. తద్వారా పురోగతి నివేదికల తయారీ వరకు మాత్రమే నోడల్ అధికారులు పనిచేశారు.

ఓ ఉద్యోగ సంఘం నాయకుడి రాసలీలలు?

- మహిళా ఉద్యోగితో వివాహేతర సంబంధం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని దేహశుద్ధి చేసిన భార్య

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు.. తోటి ఉద్యోగినితో ఏకాంతంగా ఉన్న సమయంలో భార్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని దేహశుద్ధి చేసింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ ఓ శాఖలో ఉద్యోగిగా మంచి స్థానంలో ఉండి, ప్రముఖ యూనియన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. వ్యక్తి కొన్ని రోజులుగా.. ఓ శాఖలో పనిచేసే మహిళా ఉద్యోగినితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్రిస్టియన్‌పల్లిలో ఓ గదిని అద్దెకు తీసుకుని కలుసుకునేవారు. ఈ విషయం సదరు యూనియన్ అధ్యక్షుడి భార్యకు తెలియడంతో బుధవారం ఇద్దరూ ఏకాంతంగా ఉండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత మాటామాట పెరగడంతో యూనియన్ అధ్యక్షుడికి దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. అయితే ఈ విషయం బయటకు పొక్కకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ కొందరు ఉద్యోగులు, ఒకరిద్దరు పోలీసుల సహకారంతో మంతనాలు చేసినట్లు సమాచారం. ఈ విషయమై రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లును 'సాక్షి' వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, సమాచారం కూడా లేదని చెప్పారు.

ఉదారంగా వ్యవహరించాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బ్యాంకర్లు పంటల ఆర్థికస్థాయి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించాలని కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. బుధవారం ఐడీఓసీలోని కలెక్టర్ చాంబర్‌లో ఉమ్మడి జిల్లాల బ్యాంకర్లు, ఎల్‌డీఎంలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచితేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. అప్పుడే వీరికి రుణ సాయం సైతం పెరుగుతుందని, అన్ని రకాల పంటలకు ఇది వర్తింపజేయాలన్నారు. ముఖ్యంగా పాడి గేదెలు పెంచుకునేందుకు గాను మేత కోసం కిసాన్ క్రెడిట్ కార్డు కింద ఎక్కువ రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో బర్రెల మేత కోసం ఇచ్చే రుణ శాతం తక్కువగా ఉందని, దీనిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి మధుసూదన్‌గౌడ్, మత్స్యశాఖ ఏడీ రాధారోహిణి, సెరికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ఎల్‌డీఎం కల్వ భాస్కర్, ఏడీఏ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎక్వాయిపల్లిలో క్షుద్రపూజలు

పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు


పట్టుబడిన నిందితులు

బాలానగర్: మండల పరిధిలోని చెన్నంగులగడ్డ గ్రామపంచాయతీ ఎక్వాయిపల్లిలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఓ ఇంట్లో క్షుద్రపూజలు చేస్తున్న విషయాన్ని గ్రామస్తులు గమనించారు. దీంతో అక్కడకు చేరుకుని క్షుద్ర పూజలు చేయడానికి వచ్చిన ఐదుగురిని పట్టుకోబోగా.. అందులో ఒకరు తప్పించుకున్నారు. నలుగురిని బంధించి పోలీసులకు అప్పగించారు. క్షుద్ర పూజలు చేయడానికి ఎక్కడ నుంచి వచ్చారు? ఎందుకోసం చేస్తున్నారని? వారిని గ్రామస్తులు ప్రశ్నించగా.. తాము హైదరాబాద్, నారాయణ్‌ఖేడ్ ప్రాంతాలకు చెందిన వారుగా చెప్పారు. క్షుద్రపూజలు చేసి బంగారం తవ్వి తీయడానికి వచ్చినట్లు వివరించారు. ఈ సంఘటనలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని బాలానగర్ స్టేషన్‌కు తరలించి, విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలియజేశారు.



ఈ రిజర్వాయర్ మాకొద్దు


బల్మూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

- ఉమామహేశ్వర రిజర్వాయర్ ఆపాలని రైతుల నిరసన

బల్మూర్: ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణంతో పంట పొలాలు ముంపునకు గురై జీవనాధారం దెబ్బతింటుందని మండల కేంద్రం బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. మండలంలోని అంబగిరి, అనంతవరం, బల్మూర్, మైలారం సమీపంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనుల కోసం పది రోజుల క్రితం నుంచి కాంట్రాక్టర్ క్యాంపు ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తుండటంతో రైతులు బుధవారం ముకుమ్మడిగా నిరసన తెలిపారు. ఈ రిజర్వాయర్ ఏర్పాటుతో పై నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 2,500 ఎకరాల భూములు ముంపునకు గురి కావడంతో పాటు గ్రామాలకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా గత పాలకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరి కాదన్నారు. రైతుల నడ్డి విరిచేలా ఏర్పాటు చేసే ఈ రిజర్వాయర్‌ను కొత్త ప్రభుత్వం రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు.

నమ్మించి వంచించాడని..

పురుగు మందు తాగిన యువతి

- ఆస్పత్రికి తరలించిన పోలీసులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శారద

బల్మూర్: ప్రేమ పేరుతో మోసపోయిన ఓ యువతి.. పెద్దల సమక్షంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు.. బల్మూర్ మండలంలోని బాణాలకు చెందిన కోట్ర శారద, అదే గ్రామానికి చెందిన మల్లేష్‌లు మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఏడాది కిందట యువతి కుటుంబ సభ్యులు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో బలవంతంగా వివాహం చేశారు. అతడికి విడాకులు ఇవ్వాలని.. నేను పెళ్లి చేసుకుంటానని మల్లేష్ నమ్మించడంతో మూడు నెలల కిందట శారద తన భర్తకు విడాకులు ఇచ్చింది. అనంతరం మల్లేష్ వద్ద పెళ్లి ప్రస్తావన తేగా.. అతడు నిరాకరించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ క్రమంలో బుధవారం ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు బల్మూర్‌లో పంచాయితీ పెట్టి మాట్లాడుతుండగా.. మల్లేష్ పెళ్లి చేసుకోనని తేల్చిచెప్పడంతో పాటు కొందరు పెద్దలు శారదను దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా ఈ విషయంపై యువతితో పాటు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడానికి నిరాకరిస్తున్నారని, ప్రేమికుడితో పెళ్లి చేయించాలని కోరుతున్నారని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


సీజ్ చేసిన వాహనాలు

నంబర్ సరిగా లేని వాహనాల పట్టివేత


కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేవలం నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డ్రైవ్ నిర్వహించి 84 వాహనాలు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. దీంతో పాటు సరైన నెంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి వాటికి పెండింగ్ ఉన్న ఈ–చలాన్స్ కట్టించారు. రూ.33,600 జరిమానా విధించారు. జిల్లాలో రహదారి భద్రత చర్యల్లో భాగంగా ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు. ప్రతి వాహనదారుడు పెండింగ్ ఈ–చలాన్ క్లియర్ చేయడంతో పాటు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు.

వేరుశనగలో లద్దె పురుగు, ఆకు ముడత


అలంపూర్‌లో సాగులో ఉన్న వేరుశనగ పంట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


ఆకుముడత ఆశించిన వేరునగ మొక్క


పైరుకు ఆశిస్తున్న లద్దె పురుగు

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది వేరుశనగ పంట మోస్తారుగా సాగు చేశారు. వాతావరణం అనుకూలత ఆధారంగా రైతులు వేరుశనగ సాగుపై దృష్టిసారించారు. సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం 35–45 రోజుల కావస్తోంది. ప్రస్తుత వాతావరణ మార్పులతో లద్దె పురుగు, ముడత, రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. వేరుశనగ పంటలో లద్దె పురుగు, ఆకుముడత కనిపిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంటపై వాటి ఉధృతి పెరిగి తీవ్ర నష్టం చేసే ప్రమాదం ఉన్నట్లు పేర్కొంటున్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణపై ఈ విధంగా వివరిస్తున్నారు.

లద్దె పురుగు :

తల్లి రెక్క పురుగు ఆకు ఆకు అడుగు భాగంలో గుంపులుగా తింటాయి. దీని వలన పత్రాలన్నీ జల్లెడగా మారుతాయి. తర్వాత దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

నివారణ :

దీని నివారణ కోసం ఫ్లూబెండమయిడ్ 30 మి.లీ, క్లోరాంత్రినిల్‌పోల్ 30 మి.లీ, ఎమామెక్టిన్ బెంజోఏయిట్ 100 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

విషపు ఎర :

లద్దెపురుగు రాత్రి వేళల్లో ఆకులను తింటూ నష్టపరుస్తుంది. అందు వలన విషపు ఎరలు ఈ పురుగును బాగా నియంత్రిస్తాయి.

ఎర తయారీ :

10 కిలోల తాడు, ఒక కిలో బెల్లం పాకం మరియూ ఒక లీటరు క్లోరోపైరిఫాస్ లేదా మోనో క్రోటోఫాస్‌ను కలిపి ఉండలు ఉండలుగా చేసి సాయంత్రం వేళలలో పొలంలో చల్లితే లద్దె పురుగును సమర్థవంతంగా నియంత్రించ వచ్చు.

ఆకు ముడత :

ఈ పురుగు పత్రాలపై ఉంటుంది. రెండు మూడు పత్రాలను కలిపి వాటిలో ఉండి పత్ర హరితాన్ని గోకి తినేస్తాయి. దీని వలన ఆకులన్ని ఎండి కాలినట్లు కనిపిస్తాయి.

నివారణ :

ఈ పురుగు నివారణకు క్లోరోపైరిపాస్ 2.0 మి.లీకు లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

మల్లేశ్వరంలో బయటపడిన అగస్తేశ్వర లింగం

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో వారం రోజుల క్రితం ఎంతో పురాతనమైన అగస్తేశ్వరలింగ ఆలయ పునర్నిర్మాణం కోసం గ్రామపెద్దలు గాయత్రీ పీఠాధిపతి శ్రీకాంతేంద్రస్వామితో కలిసి పూజలు చేశారు. 500 ఏళ్ల నాటి ఆలయం శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించిన సమయంలో 43 ఏళ్ల కిందట ముంపునకు గురైంది. ఈ క్రమంలో గ్రామస్తులు కలిసి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వారం రోజుల నుంచి పెద్దఎత్తున పనులు చేపట్టగా.. మంగళవారం పురాతనమైన అగస్తేశ్వర లింగం బయటపడింది. దీంతో బుధవారం గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని పూజలు చేశారు. గ్రామస్తులందరి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని తిరుపాటి నాగరాజు చెప్పారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, నర్సింహయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాముడు, అర్చకులు శ్రీహరి, నాగేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


తవ్వకాల్లో బయటపడిన అగస్తేశ్వర లింగం



బుధవారం కాకినాడలో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు కార్యక్రమానికి హాజరైన అశేష జనసందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఊరు మారింది

ఇచ్ఛాపురం–కుప్పం.. ఏ ఊరైనా సరే.. మనం తెచ్చిన మార్పులు మీరే చూడండి: సీఎం జగన్

- కేవలం 55 నెలల కాలంలో పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం
- ఏ రాష్ట్రమూ ఇవ్వని విధంగా 66.34 లక్షల మందికి పింఛన్లు
- రూ.3,000 వైఎస్సార్ పింఛన్ కానుకను కాకినాడ నుంచి ప్రారంభించిన ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా 'వైఎస్సార్ పెన్షన్ కానుక' ద్వారా అవ్వా తాతలకు రూ.3,000 చొప్పున పింఛన్‌ను మన రాష్ట్రంలో మాత్రమే అందిస్తున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మాట నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని పెంచి ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రతి నెలా 66.34 లక్షల మందికి టంఛన్‌గా ఇంటి వద్దే చేతిలో పెడుతున్నామన్నారు. ఇందుకోసం నెలకు రూ.2 వేల కోట్లు వరకు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పెన్షన్ మొత్తాన్ని పెంచడమే కాకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూరేలా పెన్షన్ల సంఖ్యను కూడా పెంచామన్నారు. నాడూ నేడూ.. ఇదే రాష్ట్రం, అంతే బడ్జెట్, నిరుపేదలూ అదే సంఖ్యలో ఉన్నా చంద్రబాబు హయాంలో మేలు చేయాలనే ఆలోచన ఎందుకు చేయలేదు? బటన్లు ఎందుకు నొక్కలేదు? ఇవాళ మీ బిడ్డ ఇవన్నీ ఎలా చేయగలుతున్నాడు? అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. అవ్వా తాతలకు పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచుకుంటూ వెళతానంటూ నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్ బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) క్రీడా మైదానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందచేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, సీఎం జగన్ అభిమానుల ఆధ్వర్యంలో ఈనెల 8వతేదీ వరకు ఈ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు.

> చంద్రబాబు హయాంలో పింఛన్ కేవలం రూ.1,000 మాత్రమే ఉండేది. గత ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రమే రూ.2 వేలు చేశారు. ఆ ఎన్నికలే రాకపోతే చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని పెంచేవారా?
> -కాకినాడ సభలో సీఎం జగన్

ఈ సందర్భంగా కాకినాడకు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనవాహినిని ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు.

క్యాలెండర్‌లో కాదు.. జీవితంలో మార్పు

అవ్వాతాతల పెన్షన్ రూ.3,000 వరకూ పెంచుకుంటూ పోతాం అని మేనిఫెస్టోలో చెప్పిన మాటను తు.చ. తప్పకుండా నెరవేరుస్తూ మీ అందరి సమక్షంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం దేవుడు నాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నా. కొత్త సంవత్సరం అంటే కేవలం క్యాలెండర్‌లో ఒక మార్పు మాత్రమే కాదు. కొత్త సంవత్సరం అంటే ప్రతి ఒక్కరి జీవితంలో ఆదాయం, ఆనందం పెరగాలి. మరింత మెరుగైన పరిస్థితుల్లోకి వెళ్లాలి. అలాంటి గొప్ప కార్యక్రమంలో ఇవాళ పాలు పంచుకుంటున్నా.

నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలు..

పెన్షన్ తీసుకుంటున్న వీళ్లందరి పరిస్థితిని ఒక్కసారి గమనిస్తే పెద్ద వయసు వల్ల గానీ, విధిరాత వల్ల గానీ తమను తాము పోషించుకోలేని పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. అటువంటి 66.34 లక్షల మంది అవ్వాతాతలకు, అభాగ్యులకు, వితంతువులకు మంచి చేస్తూ మన ప్రభుత్వం సామాజిక పెన్షన్‌ను రూ.3,000 చేసింది. ఈ రోజు మనం పెన్షన్ల కోసం ప్రతి నెలా చేస్తున్న ఖర్చు దాదాపు రూ.2 వేల కోట్లు. నెలలో ఒకటో తారీఖు మిగిలిన ప్రపంచానికి సెలవు, పండగ రోజు కావచ్చు కానీ మీ జగనన్న సైన్యం, నా వలంటీర్ తమ్ముళ్లు, చెల్లెమ్మలకు మాత్రం అది ప్రతి అవ్వాతాతల ముఖంలో చిరునవ్వు చూసే రోజు. సూర్యోదయానికి ముందే చిరునవ్వుతో గుడ్ మార్నింగ్ చెబుతూ ప్రతి అవ్వకు, తాతకు మంచి మనవడిగా, మనవరాలిగా చేయూతనిస్తున్న నా వలంటీర్లకు మాత్రం అది సెలవు రోజు కాదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మీ ఇష్టం.. ఏ గ్రామాన్నైనా తీసుకోండి

ఇవాళ రాష్ట్రంలో ఇచ్ఛాపురం నుంచి కుప్పం దాకా ఏ గ్రామాన్నైనా తీసుకోండి. మీ ఇష్టం.. ప్రతి గ్రామంలోనూ మార్పు కనిపిస్తోంది. అడుగు పెడుతూనే ప్రతి గ్రామంలోనూ గతంలో లేని విధంగా మార్పు కనిపిస్తూ గ్రామ సచివాలయం గోచరిస్తుంది. అందులో 10 మంది శాశ్వత ఉద్యోగులు కనిపిస్తారు. ప్రతి గ్రామంలోనూ వలంటీర్ వ్యవస్థతోపాటు ఇంటి వద్దకే అందుతున్న రేషన్, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ కనిపిస్తాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమూ కనిపిస్తుంది. నాడు–నేడుతో గ్రామంలో మారిపోయిన స్కూళ్లు, ఆస్పత్రులతో మన కళ్ల ఎదుటే మార్పులు కనిపిస్తాయి. మెరుగులు దిద్దిన 108, 104 కనిపిస్తాయి. గతంలో 1,050 రోగాలకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని ఇవాళ 3,250 ప్రొసీజర్లకు వర్తింపచేస్తూ ప్రతి పేదవాడికి అండగా నిలబడ్డాం. రైతులకు పగటి పూటే ఉచిత కరెంటు 9 గంటలు ఇస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చదువుకుంటున్న పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అండగా నిలబడుతున్నాం. వసతి దీవెనతో అండగా ఉన్న పరిస్థితులూ కనిపిస్తున్నాయి. పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, స్కూళ్లలో ఐఎఫ్‌పీ తరగతి గదులు కనిపిస్తాయి. కేవలం 55 నెలల కాలంలో మీ బిడ్డ పరిపాలనలో మాత్రమే చోటుచేసుకున్న మార్పులు ఇవన్నీ.

కుటుంబాలను చీల్చే కుట్రలు!

అలాంటి రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కుటుంబాలను చీల్చే రాజకీయ కుట్రల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. మంచి చేయడం, పేదవాడికి అండగా నిలబడటమే మీ బిడ్డకు తెలిసిన రాజకీయం అని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ అబద్ధాలు చెబుతారని, పొత్తులతో మోసపూరితంగా మీ ముందుకు వస్తారని హెచ్చరించారు. అవ్వా తాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలకు పెంపు సందర్భంగా బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడారు.

అడ్డుకునే దిక్కుమాలిన ఆలోచన..

గతంలో ఒకాయన సీఎంగా ఉన్నాడు. ఆయనకో దత్తపుత్రుడూ ఉన్నాడు. ఆ దత్తపుత్రుడు, దత్త తండ్రి ఇద్దరూ కలిసి 2014 ఎన్నికలప్పుడు ప్రతి పేదవాడికీ 3 సెంట్ల స్థలం, ఇల్లు కట్టిస్తామని వాగ్దానం చేసి చివరికి ఒక్క సెంటు కూడా ఇచ్చిన పాపాన పోలేదు. అక్కచెల్లెమ్మలను, పేదవాళ్లను అడ్డగోలుగా మోసం చేస్తే ఈ దత్తపుత్రుడు ఏ ఒక్క రోజూ ప్రశ్నించకపోగా కేంద్రానికి ఒక లేఖ కూడా రాయలేదు. ఇవాళ మీ బిడ్డ 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చి 22 లక్షల ఇళ్లను కడుతూ అక్కచెల్లెమ్మల ముఖాల్లో సంతోషం చూడాలని కోరుకుంటుంటే ఈ దత్తపుత్రుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తాడు. పేదల కోసం కట్టే ఇళ్లలో, ఇంటి స్థలాల్లో అవినీతి జరిగిందంటూ ఆ కార్యక్రమాన్ని ఆపించాలనే దిక్కుమాలిన ఆలోచన చేయగలిగిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఈ అన్యాయస్తులు మాత్రమే!

ఆ అవినీతిలో.. పార్టనర్

చంద్రబాబు అవినీతిపరుడని సాక్షాత్తూ కేంద్ర ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్, ఈడీ సమన్లు ఇచ్చాయి. కోర్టులు కూడా నిర్ధారించి అన్నీ పరిగణలోకి తీసుకుని ఆయన్ను జైల్లో పెడితే ఈ దత్తపుత్రుడు వెళ్లి దత్తతండ్రిని పరామర్శిస్తాడు. అంత అవినీతిపరుడు ప్రపంచంలో ఎక్కడా లేకపోయినా ఆ పెద్దమనిషి చాలా మంచోడని ఈయన సర్టిఫికెట్ ఇస్తాడు. అక్కడేమో అవినీతి జరిగినా మాట్లాడడు. ఇక్కడేమో అవినీతి జరగకపోయినా మన ప్రభుత్వంపై అభాండాలు వేస్తాడు. చంద్రబాబు అవినీతి చేసినా ఎందుకు నోరు మెదపడంటే.. ఆ అవినీతిలో ఈయన కూడా పార్టనర్ కాబట్టి! దీనిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5, దత్తపుత్రుడు ప్రశ్నించరు, మాట్లాడరు.

బాబు ఎందుకు చేయలేదు?.. మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడు?

గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు నొక్కిన బటన్లు ఎన్ని? ఉత్త సున్నా! ఇవాళ మీ బిడ్డ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ పెన్షన్, ఇతర పథకాలు అందిస్తూ నేరుగా బటన్ నొక్కుతున్నాడు. నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయి. ఇంతవరకూ రూ.2.46 లక్షల కోట్లు నేరుగా జమ అయ్యాయి. ఎక్కడా లంచాలు లేవు. వివక్ష లేదు. మీ బిడ్డ ఎలా చేయగలిగాడు? చంద్రబాబు ఎందుకు చేయలేకపోయాడో ఆలోచించాలి. అప్పుడూ ఇప్పుడూ అదే రాష్ట్రం, అదే బడ్జెట్. చంద్రబాబు పాలనలో కన్నా మీ బిడ్డ ప్రభుత్వంలో అప్పుల గ్రోత్ రేటు తక్కువ. కేవలం మారిందల్లా ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న వ్యక్తి మాత్రమే. అప్పట్లో ఈ బటన్లు నొక్కే కార్యక్రమం ఎందుకు జరగలేదు? ఎందుకు రూ.2.46 లక్షల కోట్లు ఇవ్వలేకపోయారు? అప్పట్లో దోచుకోవడం, దోచుకున్నది పంచుకున్నది తప్ప పాలన జరగలేదు. అప్పట్లో ఒక గొప్ప గజదొంగల ముఠా పాలన చేసేది. అప్పట్లో డీపీటీ (దోచుకో, పంచుకో, తినుకో) జరిగితే మీ బిడ్డ హయాంలో డీబీటీ జరుగుతోంది.

చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దుచేయాలి



చిన్నచింతకుంట: మరికల్ మండలం చిత్తనూర్ సమీపంలో ఉన్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని టీఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి పి.యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చిన్నచింతకుంటలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీ వల్ల పరిసర ప్రాంతాలలో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని.. మరికల్, చిన్నచింతకుంట, నర్వ మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కంపెనీని రద్దు చేయించాలని కోరారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ నాయకులు నాగరాజు, రాములు పాల్గొన్నారు.

రమాదేవికి సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి అవార్డు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): నాయీ వనిత మండలి అధ్యక్షురాలు రమాదేవికి సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. దేశ తొలి మహిళా ఉపాధ్యాయులు, సామాజిక సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జయంతి ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ మంజరి చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. మహిళల అభ్యున్నతి కోసం కృషిచేసినందుకు గాను పురస్కారం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో నాయీ మిత్రమండలి రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు ఇబ్బందులుండొద్దు



దేవరకద్ర రైల్వే స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్



జక్లేర్ స్టేషన్‌లో ప్యానల్‌ను పరిశీలిస్తున్న జీఎం

- కాచిగూడ–క్రిష్ణా సెక్షన్‌ను తనిఖీ రైల్వే జీఎం
- పలు రైల్వే స్టేషన్ల వసతులు, సిగ్నలింగ్ పరిశీలన

స్టేషన్ మహబూబ్‌నగర్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ బుధవారం కాచిగూడ–మహబూబ్‌నగర్–దేవరకద్ర–కృష్ణా సెక్షన్‌ను తనిఖీ చేశారు. కాచిగూడ–క్రిష్ణా సెక్షన్‌లో రియల్ విండో తనిఖీ ద్వారా ట్రాక్ సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా అంశాలను పరిశీలించారు. మరికల్ రైల్వే స్టేషన్‌ను జీఎం సందర్శించి ఆవరణను, స్టేషన్ మాస్టర్ కార్యాలయంలోని రికార్డులతో పాటు పాయింట్ 102ను పరిశీలించారు. అనంతరం జక్లేర్ స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమీక్షించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలు, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, స్టోర్‌రూం, రిలే గదులతోపాటు ప్రాంగణాన్ని పరిశీలించారు. మాగనూర్‌లో స్టేషన్‌ను జీఎం తనిఖీ చేసి స్టేషన్ ఆవరణ, మాస్టర్ కార్యాలయంలో రికార్డులు, 104 పాయింట్‌ను తనిఖీ చేసి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పలువురు ప్రజాప్రతినిధులు జీఎంను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అదే విధంగా దేవరకద్ర రైల్వే స్టేషన్‌ను కూడా జీఎం సమగ్రంగా తనిఖీ చేసి ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను, బుకింగ్ కార్యాలయాన్ని పరిశీలించడంతో పాటు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ప్రొఫైల్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రత్యేక దృష్టిసారించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జీఎం వెంట హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్ సొసైటీకి పెట్రోల్ బంక్ మంజూరు



పెట్రోల్‌బంక్ మంజూరు పత్రాలు అందుకుంటున్న నాగర్‌కర్నూల్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

కందనూలు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొట్టమొదటిగా నాగర్‌కర్నూల్ పీఏసీఎస్ సొసైటీకి పెట్రోల్‌బంక్ మంజూరైంది. ఈ మేరకు బుధవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహబూబ్‌నగర్ సీఈఓ లక్ష్మయ్య చేతుల మీదుగా నాగర్‌కర్నూల్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పెట్రోల్ బంక్ మంజూరు పత్రాలు అందుకున్నారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోనే మొదటి సారి సొసైటీకి పెట్రోల్ బంక్ మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. రెండేళ్ల శ్రమ ఫలించిందని పేర్కొన్నారు. సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. పెట్రోల్‌బంక్‌ను మండల పరిధిలోని వనపట్ల గ్రామ శివారులో ఏర్పాటు చేస్తామని, సొసైటీ అభివృద్ధికి పెట్రోల్ బంక్ చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. చిన్న, సన్నకార రుణాలు అందించడంతో పాటు వ్యాపార రంగంలో సొసైటీ అగ్రగామిగా నిలుస్తుందని పేర్కొన్నారు. త్వరలో బంక్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు



సమస్యలను వివరిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఇందులో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి సీఎంకు వినతిపత్రం అందజేసి ఉపాధ్యాయ సమస్యలను వివరించారు. హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతుల సందర్భంగా టెట్ నిబంధనలను రద్దు చేయాలని, జోన్–2 పదోన్నతులు నిలిచిపోవడం వల్ల దాదాపు 856 ఉపాధ్యాయులు నష్టపోతున్నారని తెలిపారు. టెట్ ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా పదోన్నతులు ఇస్తూ కనీసం ఆరేళ్లు టెట్ ఉత్తీర్ణులు కావడానికి అవకాశం ఇవ్వాలని, 44 ఏళ్లు దాటితే టెట్ పరీక్ష రాయడానికి అర్హత లేదని, ఈ విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

నిలకడగా రామన్‌పాడు నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తి నీటి మట్టం 1,019 అడుగులు నిలకడగా కొనసాగుతోంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 325 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

పేద విద్యార్థులకు అన్నివిధాల ప్రోత్సాహం



కో–ఎడ్యుకేషన్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలల్లో సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనం ప్రారంభం

జడ్చర్ల టౌన్/బాలానగర్/నవాబుపేట/మిడ్జిల్: నియోజకవర్గంలోని నిరుపేద ప్రతిభ కల విద్యార్థులకు ఉన్నత చదువులకోసం అన్ని విధాల ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం పట్టణంలోని కో–ఎడ్యుకేషన్, బాలికల జూనియర్ కళాశాలల్లో సొంత ఖర్చుతో విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతం 50 వరకే నమోదవుతుందని, అందుకు కారణాలు తెలుసుకుంటే భోజన సమస్య ఉందన్నారు. నియోజకవర్గంలోని ఐదు జూనియర్ కళాశాలల్లో పరీక్షల వరకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతిభ గల విద్యార్థులు 100 మంది వరకు ఉన్నత విద్యాకోసం అవసరమైన కోచింగ్ ఇప్పిస్తానన్నారు. తన పర్యటనలో పోలీసులు రావటం వల్ల ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని గుర్తించి రావొద్దని డీజీపీని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వంద పడకల ఆస్పత్రి విషయంలో భవనం మాత్రమే నిర్మించారని, సిబ్బందిని నియమించలేకపోయారని ఆరోపించారు. ఫార్మా కంపెనీలతోపాటు ఏ పరిశ్రమ అయినా సీఎస్ఆర్ నిధుల ద్వారా నేరుగా సేవా కార్యక్రమాలు చేయాలని ఎమ్మెల్యే కంపెనీ నిర్వాహకులకు పిలుపునిచ్చారు. కొందరు మధ్యవర్తులకు కమీషన్లు ఇస్తున్నారని తనకు సమాచారం అందిందని, అలాంటివి ఎవరైనా అడిగితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని నిబంధనలు పాటించాలని, కాలుష్య రహితంగా నడిపించాలన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి

బాలానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే కళాశాల ప్రహరీ, టాయిలెట్స్ నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేస్తానన్నారు. అంతకుముందు కళాశాలలో తాగునీటి మిషన్ మరమ్మతుకు రూ.50 వేలను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. నవాబుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ రాజునాయక్, మాజీ జెడ్పీటీసీ రబ్బాని ప్రారంభించారు.

జోగుళాంబ హుండీ ఆదాయం రూ.57,99,176



హుండీ డబ్బులను లెక్కిస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. దేవదాయశాఖ పర్యవేక్షకురాలు వెంకటేశ్వరమ్మ నేతృత్వంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, పాలకమండలి సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, సి.వెంకటేష్, వెంకటనారాయణరెడ్డి, ఆనంద్ శర్మ, అడవప్ప, సత్యన్న, కేశన్న పాల్గొన్నారు. ఉదయం 11నుంచి సాయంత్రం 6 గంటల దాక హుండీ లెక్కింపు కొనసాగింది. సమయాభావం కారణంగా బాలబ్రహ్మేశ్వరస్వామి, అన్నదాన సత్రం హుండీలను లెక్కించలేకపోయారు. మునుపెన్నడూ లేనివిధంగా హుండీ ఆదాయం రూ.57,99,176 వచ్చినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా వివిధ దేశాల కరెన్సీతో పాటు 65 గ్రాముల 200 మిల్లీ గ్రాముల మిశ్రమ బంగారు, 70 తులాల మిశ్రమ వెండిని భక్తులు సమర్పించినట్లు చెప్పారు. హుండీ డబ్బులను స్థానిక కోఆపరేటివ్ బ్యాంకులో జమచేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ అంజలి, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్రయ్య ఆచారి, రాజేష్ పాల్గొన్నారు.